క్లుప్తంగా

క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మి రాంరెడ్డికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న చిట్యాల రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

చిట్యాల: పట్టణానికి చెందిన గుమ్మి రాంరెడ్డి క్రెడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈమేరకు గురువారం చిట్యాల పట్టణానికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాంరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొబ్బలి శివశంకర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంరెడ్డి, వరకాంతం నరేందర్‌రెడ్డి, ముప్ప శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి అమరేందర్ రెడ్డి, కాకులారపు బొర్రారెడ్డి, కొంతం సత్తిరెడ్డి, ఘంటా శ్రీనివాస్‌రెడ్డి, యాస సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసిందని, ఇంటర్‌లో వెలువడిన ఫలితాలు అందుకు సాక్షమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ అన్నారు. గురువారం స్థానిక ఎన్జీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్ కాలేజీలకు ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానం వచ్చిందని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల క్రాంతికుమార్, ప్రేమ్‌కుమార్, మండలి మహేష్‌రెడ్డి, శివకుమార్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

తిప్పర్తి: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రదీప్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలు, రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్, బుర్ర శేఖర్, ఎరుకల నిరంజన్ గౌడ్, కొన్రెడ్డి గిరి, ఎరుకల యాదయ్య, ఆకుల వెంకట్రాం, ఇస్కిల్ల మహేందర్, అంజయ్య, బాలకిషన్, యాదయ్య, అశోక్, లింగయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నల్లగొండ టూటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆరాధనోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీలో గురువారం కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లెప్రసీ కాలనీ, అంబేద్కర్ కాలనీలకు చెందిన 35 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన శ్రీశారద సేవా ట్రస్ట్ చైర్మన్ శారద తెలిపారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, పరిమళ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

నకిరేకల్: అర్హులైన దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని బీజేపీ నేత, తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన వికలాంగుల చైతన్య కార్యక్రమంలో భాగంగా గురువారం నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కనగల్: బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కరీంపాష కోరారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ దోటి శ్రీనివాస్, ఎర్రబెల్లి నర్సిరెడ్డి, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, కదారి కృష్ణయ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మర్రిగూడ: వరంగల్ జిల్లాలో ఈనెల 25న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను గురువారం మర్రిగూడ మండల కేంద్రంలో రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల యాదయ్యగౌడ్, రాపోలు యాదగిరి, ఎండీ గౌస్, శేఖర్, గిరిబాబు, నరేష్, సత్తయ్య, రఘు, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కరువు



తిరుమలరాయునిగూడెం కేంద్రంలో తాటిచెట్టు నీడన కూర్చున్న రైతులు



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో వినియోగంలోకి రాని మరుగుదొడ్లు, మూత్రశాలలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనిపించని మౌలిక సదుపాయాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

శాలిగౌరారం: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కొనుగోలు చేసిన ధాన్యంపై కమీషన్లతో పాటూ మౌలిక వసతుల కల్పనకోసం నిధులు వెచ్చిస్తోంది. ప్రభుత్వం నిధులు చెల్లిస్తున్నప్పటికీ కేంద్రాల నిర్వాహకులు మాత్రం కేంద్రాలకు వచ్చే రైతులకు వసతుల ఏర్పాటు కోసం ఎలాంటి ర్యలు తీసుకోవడం లేదు. దీంతో కేంద్రాల్లో తమ పంటను అమ్ముకునేందుకు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతులకు సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

15 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రస్తుత యాసంగి సీజన్‌లో శాలిగౌరారం మండలంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 15 కేంద్రాలను మంజూరు చేసింది. ఐకేపీ ఆధ్వర్యంలో ఎన్జీ కొత్తపల్లి, రామాంజాపురం, గురుజాల, భైరవునిబండ, చిత్తలూరు, ఆకారం, తుడిమిడి గ్రామంలో, పీఏసీఎస్ ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, అడ్లూరు, ఊట్కూరు, మాధారంకలాన్ గ్రామంలో, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో పెర్కకొండారం, రామగిరిలో, అదేవిధంగా ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇటుకులపహాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి.

నీడ కోసం చెట్లే దిక్కు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ కోసం టెంటు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలి. కానీ కేంద్రాలలో ఎక్కడా ఇలాంటి వసతులు కల్పించిన దాఖలాలు లేవు. దీంతో రైతులు చెట్ల కిందనే సేదతీరుతున్నారు. కొన్ని కేంద్రాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కోక తప్పడంలేదు. ఇక మరుగుదొడ్ల విషయమైతే ఏ ఒక్క కేంద్రంలో కనుచూపుమేరలో కూడా కనిపించదు. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మురగుదొడ్లు ఉన్నా వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా తాళం వేశారు. కనీసం మూత్రశాలలు కూడా లేకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే మహిళల పరిస్థితి అయితే వర్ణణాతీతం.

తాగునీరు కూడా లేదు



శాలిగౌరారం ప్రాజెక్టు ఆవరణలో తిరుమలరాయునిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రంలో నీడ, తాగేందుకు నీరు కూడా సరిగ్గా ఉండటంలేదు. ఇంటివద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాం. ధాన్యం ఆరబోసి వారం అవుతుంది. రోజులు గడుస్తున్నాయే కానీ ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తరో అర్థంగాక కేంద్రంలోనే పడిగాపులుకాస్తున్నాం.

– అంకిరెడ్డి పద్మ, మహిళా రైతు, తిరుమలరాయునిగూడెం

చెట్లకింద సేదదీరుతున్నాం



తిరుమలరాయునిగూడెం కేంద్రానికి తన ధాన్యాన్ని అమ్ముకునేందుకు తీసుకువచ్చి సుమారు 20 రోజులు కావస్తోంది. కొనుగోలు కేంద్రంలో రైతులు ఉండేందుకు నీడ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఎండలకు చెట్లకింద సేదదీరుతున్నాం.

– చీమల నర్సింహ, రైతు, జాలోనిగూడెం

భూ భారతితో సమస్యలకు చెక్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

గట్టుప్పల్: గతంలో ఉన్న ధరణి చట్టంతో రైతులు, అధికారులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, దీని స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం గట్టుప్పల్ మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భూ భారతి చట్టంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అసైన్డ్ భూముల రెగ్యులరైజేషన్, సాదాబైనామాల సమస్యల పరిష్కారం, సరిహద్దుల వివాదాల పరిష్కారం ,మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ ,తదితర అన్ని సమస్యలకు పరిష్కారం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దారు రాములు, ఎంపీడీఓ మాధవ రెడ్డి, నాయకులు కంచుకుంట్ల సంపత్, కంచు కుంట్ల సుభాస్, రావుల రమేష్, బీమనపల్లి రమేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు: ధరణిలో లేని సవరణ వెసులుబాట్లు భూభారతిలో ఉన్నాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం భూభారతి చట్టంపై చండూరులో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. భూముల విషయంలో గతంలో జరిగిన తప్పులు మరలా జరగవద్దని అన్నారు. మునుగోడు నియోజకవర్గం సాగునీరు లేని ప్రాంతం కాబట్టి ఎల్మకన్నె ఫీడర్ చానల్, శేషిలేటివాగు, బెండలమ్మ చెరువు లాంటి చిన్నచిన్న ప్రాజెక్టుల ద్వారా తక్కువ నీటితో సాగునీటిని అందించవచ్చని, వాటికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీదేవి, మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, తహసీల్దార్ దశరథనాయక్, ఎంపీడీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లిలో అవగాహన సదస్సు

నాంపల్లి: భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం నాంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్ కంటే ప్రస్తుతం అమలవుతున్న భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దార్ దేవ్‌సింగ్, ఎంపీడీఓ రామకృష్ణశర్మ, సింగిల్‌విండో చైర్మన్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చండూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కందాల ప్రమీల

నకిరేకల్: క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. గురువారం నకిరేకల్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మేడే ఉత్సవాలు నిర్వహించాలన్నారు. హిందువులపై ముష్కరుల దాడులను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఉగ్రవాదం పెచ్చురిల్లుతుందన్నారు. పార్టీ నేత కొప్పుల అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు ఆకుల భాస్కర్, బహురోజు ఇందిరా, చిన్నబోయిన నాగమణి, వంటిపాక క్రిష్ణ,ఎర్కల అంజయ్య, సాకుంట్ల నర్సింహ, గింజల లక్ష్మి, గురుజ స్వరూప, బొడ్డుపల్లి లక్ష్మీనర్సయ్య, దానాల వెంకట్‌రంగారెడ్డి, పాలడగు పరమేశం,గాదగోని అంజయ్య, పన్నాల శశికళ, నర్సింహ, పుట్ట వెంకటేష్ పాల్గొన్నారు.

ఫూలే, అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలి



జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో జన జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలో 28న నిర్వహించనున్న ఫూలే, అంబేద్కర్ జన జాతరలో పాల్గొనాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద నగేష్, ఉపాధ్యక్షుడు శేఖర్ కోరారు. గురువారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీనియర్ న్యాయవాదులు అనంతల శంకరయ్య, దర్శనం నరసింహ, మోహన్ రెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి పందుల సైదులు గౌడ్, రమేష్, మామిడి ప్రమీల, మోర ప్రవీణ్ కుమార్, స్వామినాథ, నాగరాజు, శివాజీ, యాదగిరి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఈనెల 28న నిర్వహించనున్న ఫూలే, అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలని న్యాయవాది వెంకటేశ్వర్లు కోరారు. గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్ వాకర్స్ ఆధ్వర్యంలో జనజాతర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, తంతెనపల్లి కృష్ణ, బెల్లి కొముర‌య్య, గుండగోని వీరయ్య, సైదులు, లక్ష్మీనారాయణ, శంకరయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : నల్లగొండలో ఈనెల 28న కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫూలే, అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంటెపాక కృష్ణ కోరారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో అమరవీరుల స్మారక భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జన జాతర కరపత్రం విడుదల చేసి మాట్లాడారు కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కట్టబక్కయ్య, చిలుముల రామస్వామి, రమేష్, కిరణ్, ఎల్లయ్య, మధు, సుధాకర్, మల్లేష్, సుహాస్ తదితరులు ఉన్నారు.

చిట్యాల: నల్లగొండలో ఈ నెల 28న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు ఫూలే జనజాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డు బాబురావు కోరారు. గురువారం చిట్యాలలో జనజాతర ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జన జాతరకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు గాదె ఎల్లేష్, జిట్ట కుమార్, చింత నగేష్, జడల రాములు, రుద్రవరం లింగయ్య, యాదయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడిలో మృతులకు నివాళి



క్లాక్‌టవర్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి న్యాయవాదులు నివాళులర్పించారు. గురువారం నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అనంతుల శంకరయ్య, మేరెడ్డి నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, శేఖర్, నర్సాజీ, రాములు, అఫ్రోజ్, లెనిన్‌బాబు, లాలయ్య, సత్తయ్య, ప్రసన్నకుమార్, రాంప్రసాద్, లక్ష్మయ్య, నవీన్, యువరాజు పాల్గొన్నారు. అదేవిధంగా న్యాయవాదులు విధులు బహిష్కరించి నల్లగొండ కోర్టు ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నగేష్, ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి, అనంతుల శంకరయ్య, రజీయుద్దీన్, శేఖర్ పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ గురువారం నల్లగొండ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాగిళ్ల మురళి, జిల్లా జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ రావు, సెక్రెటరీ జనరల్, టీఎన్జీఓ కేంద్ర సంఘ బాధ్యులు నరసింహ చారి, విజయ్ కృష్ణ, సహ అధ్యక్షుడు, కోశాధికారి జయరావు, మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జానీవియా, కార్యదర్శి శ్యామ్, మనోజ్, ప్రదీప్, టీఎన్జీఓ జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



నకిరేకల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ..

పహల్గామ్ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

నకిరేకల్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మృతులకు గురువారం నకిరేకల్ మున్సిఫ్ కోర్టులో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు నివాళులర్పించారు. ఒక్కరోజు కోర్టు విధులకు దూరంగా ఉన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు దొడ్డ సోమయ్య, అక్కెనపల్లి వీరస్వామి, పాపయ్య, మీరా మనోహర్, నాగరాజు, మురళీకృష్ణ, వెంకటరమణ, పాల్గొన్నారు.

నకిరేకల్: పెహల్గామ్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా నకిరేకల్ పట్టణంలో గురువారం రాత్రి హిందూ సంఘాలు, స్థానిక ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మజాగరణ సమితి అధ్యక్షుడు బ్రహ్మదేవర రవి శంకర్, ఆర్యవైశ్య పట్టణ, మండల, యువజన విభాగాల అధ్యక్షులు గజ్జల రామకృష్ణ, వీరవెల్లి రఘునాథ్, కందగట్ల సంతోష్, రేపాల కల్యాణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ పాల్గొన్నారు.



క్లాక్ టవర్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టీఎన్జీఓ నాయకులు



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నకిరేకల్: నకిరేకల్ మండలం నోముల గ్రామంలో దాతల సహకారంతో రూ.50లక్షలతో శ్రీ విజయ కనకదుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నారు. ఈమేరకు మహోత్సవ ఆహ్వాన పత్రికలను బుధవారం నకిరేకల్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు.



విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే

టీ తాగుతూ.. సమస్యలు తెలుసుకుని..



టీ తాగుతూ స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సు అనంతరం బస్టాండ్ సమీపంలో టీస్టాల్ వద్ద టీ తాగారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు.

హరికృష్ణకు నివాళి



హరికృష్ణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్‌లో బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఇందనూరి హరికృష్ణ(28) అంత్యక్రియలు గురువారం జరిగాయి. అతడి మృతదేహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, పరుశరాములు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

చిట్యాల: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రమూకల దాడికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపిస్తూ గురువారం చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మెట్టు మధు, గోలి అరవింద్, అబ్రూరీ శివ, చీమల సతీష్ పాల్గొన్నారు.



వెలిమినేడులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలి



కొంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి

మునుగోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం మైశేశ్వరరావు, సీసీలు, సంఘబంధం సభ్యులు తదితరులున్నారు.

కరాటే ఉచిత క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని పానగల్ రోడ్ అమూల్యకాలనీలో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మర్ కరాటే ఉచిత క్యాంపును గురువారం కాలనీ ప్రెసిడెంట్ అంబటి అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ వేసవి క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాంపల్లి కనకారావు పాల్గొన్నారు.



కరాటే క్యాంపు ప్రారంభిస్తున్న అంజయ్య

నా భర్తను బతికించండి

- కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బొల్ల రామచంద్రం
- వైద్యం ఖర్చుల నిమిత్తం దాతలు ఆదుకోవాలని భార్య వేడుకోలు



గట్టుప్పల్: చేనేత వృత్తిని నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటూ, ఇద్దరు చిన్నారులను చదివించి అత్యున్నత స్థాయికి తీసుకుపోవాలనే కోరిక నెరవేరక ముందే కుటుంబ యాజమాని కిడ్నీలు చెడిపోయి లేవలేని స్థితికి చేరాడు. 8 నెలలుగా అతడి భార్య కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన బొల్ల రామచంద్రం, అతడి భార్య సువర్ణ చేనేత మగ్గం పనులు చేసుకుంటూ తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. గత 8 నెలల క్రితం రామచంద్రానికి రెండు కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు తప్పించి రోజు చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి డయాలసిస్ కోసం వెళ్లి రావాల్సి వస్తోంది. డయాలసిస్‌తో నెలకు రూ.6వేల నుంచి రూ.7 వేల వరకు మందులు కొనుగోలు చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే బంధువుల దగ్గర చేసిన అప్పులు పెరిగిపోయాయి. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న భర్త రామచంద్రం ధీనస్థితిని చూసి సువర్ణ నిత్యం కంట నీరుతో జీవనం సాగిస్తోంది. దాతలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటుంది.



కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బొల్ల రామచంద్రంతో భార్య, ఇద్దరు కుమారులు

వైద్యఖర్చులకు కూడా డబ్బులు లేవు

కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న నా భర్త ను బతికించండి. నా ఇద్దరు పిల్లలకు రెండు పూటల భోజనం పెట్టలేక, నా భర్త పడుతున్న బాధను చూడలేకపోతున్నా. మందుల ఖర్చుకు నెలకు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు అవుతుంది. వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేవు.

– బొల్ల సువర్ణ